బాపట్ల జిల్లా కేంద్రంలో భద్రపరిచిన ఈవీఎంలు గోదాము కలెక్టర్ పరిశీలన

మిగతా 3

మనసులో మాట
KANCHARLA
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..
సంచలన తెలుగు దిన పత్రిక
అమరావతి
ఎన్టీఆర్ | కృష్ణా | గుంటూరు
పల్నాడు | బాపట్ల | ప్రకాశం
సోమవారం 18 మే 2026
పేజీలు : 8

టీచర్‌లా సేల్స్‌మెన్‌లా

- ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో అడ్మిషన్ల టార్గెట్
- మండుటెండల్లో ఇంటింటికి తిరుగుతున్న ఉపాధ్యాయులు
- వేసవి సెలవలు లేవు, ఆదివారాలు అసలే లేవు
- వేధింపులు తాళలేక సొంత డబ్బుతో అడ్మిషన్లు
- ప్రైవేటు, కార్పొరేట్ టీచర్ల వెట్టి చాకిరి

3 లో

రాష్ట్ర సోషల్ మీడియా విభాగ జాయింట్ సెక్రటరీగా దాసరి కిరణ్

భట్టిప్రోలు మే 17 మనసులో మాట.. మండలం, అద్దేపల్లి గ్రామానికి చెందిన దాసరి కిరణ్ వైయస్ఆర్సీపీ రాష్ట్ర సోషల్ మీడియా విభాగ జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర నాయకత్వం అధికారికంగా నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు గారు మాట్లాడుతూ దాసరి కిరణ్ సోషల్ మీడియా వేదికగా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుకుగా వ్యవహరిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయన నియామకం వేమూరు నియోజకవర్గ యువతకు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. నూతన జాయింట్ సెక్రటరీ దాసరి కిరణ్ మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా పార్టీ కార్యక్రమాలు, జగనన్న ప్రభుత్వ – మిగతా వార్త 3లో

నాగ పూర్ణచంద్రరావు ను పరామర్శించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట మే 17 మనసులో మాట.. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగ పూర్ణచంద్రరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు శస్త్ర చికిత్స చేయించుకొన్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు నరసరావుపేట పట్టణంలోని, మద్దూకూరి గార్డెన్స్ లోని వారి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకొని, వారిని పరామర్శించి, త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. తెలుగుదేశం పార్టీ ఐటీడీపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి మారెళ్ల అప్పారావు మాతృమూర్తి మారెళ్ళ రామతిలకం ఇటీవల స్వర్గస్తులైనారు. పట్టణంలోని సీఅర్ కాలనీ లోని వారి స్వగృహము నందు ఉంచిన వారి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, కుటుంబసభ్యులను మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పరామర్శించరు.

ధూళిపాళ్లలో ఇరువర్గాల ఘర్షణ

సత్తెనపల్లి రూరల్, మే 17(మనసులో మాట): పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ ధూళిపాళ్ల గ్రామంలో పొలం గురించి వివాదం చోటుచేసుకుంది.ఫలితంగా ఇరు వర్గాలు పొలంలో కొట్టుకున్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొలం భూమి యజమాని 1998లో మరణించిన ధూళిపాళ్ల గ్రామావాసి పూజల చిన్న లక్ష్మీనారాయణకు ఇరువురు సంతానం కాగా కుమారుడు వెంకటేశ్వర్లు, కుమార్తె లింగిశెట్టి వెంకాయమ్మల వివాహాలు అయ్యాయి. యజమాని కుమారుడు వెంకటేశ్వర్లు మరణించగా ఆ పొలం వారసత్వంగా మనవడు పూజల వీరాంజనేయులుకు సంక్రమించగా ఇతను తన అవసరాల నిమిత్తం ఆ పొలాన్ని సత్తెనపల్లి పట్టణానికి చెందిన బచ్చు మనోహర్,తాడువాయి సత్యనారాయణ (లేటు)వద్ద 13 లక్షల రూపాయలను 3 రూపాయల వడ్డీగా తీసుకొని స్థలాన్ని సేల్ డీడ్ చేసినాడు.. కొంత కాలానికి వడ్డీ కలిపి 16 లక్షలు కాగా పొలం యజమాని డబ్బు చెల్లించలేక పోయేసరికి అందరి సలహాతో ఆ పొలంలో కొంత భాగంలో ప్లాట్లుగా వేసి స్థలాన్ని 10 లక్షలకు అమ్మి – మిగతా వార్త 3లో

ప్రజల భాగస్వామ్యంతోనే నేర రహిత సమాజం

సీసీ కెమెరాలు నేటి సమాజానికి మూడో కన్ను లాంటివి

జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

చీరాల మే 17(మనసులో మాట).. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్, ఐపీఎస్ తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కాలనీలు, గ్రామాలు స్వీయ భద్రతపై దృష్టి పెట్టడం ఎంతో శుభపరిణామమని పేర్కొన్నారు. పట్టణంలోని – మిగతా వార్త 3లో

బజారా? మురికి నది ప్రవాహమా?

- పేట సన్న గండ్ల కార్యదర్శి మీ అడ్రస్ ఎక్కడ? - విధుల పట్ల మరీ ఇంత బాధ్యతారాహిత్యమా?

కారంపూడి, మే 17, (పల్నాడు జిల్లా) మనసులో మాట : కారంపూడి మండలం పేట సన్నెగండ్ల గ్రామం బాలచంద్ర నగర్ పాత సినిమా హాల్ ఎదురుగా ఉన్న మెయిన్ బజారు మురికి ఏటిని తలపిస్తున్నది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సన్నెగండ్ల గ్రామ కార్యదర్శి పట్టించుకున్న దాఖలాలు లేవని ఇక్కడి ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రతి చిన్న విషయానికి బజారుకు వెళ్లాలంటే ఈ మురికి ఏరులో నుండి నడవవలసి వస్తుందని, ఈ బజారులో చివర ఉన్న వీధిలోని వారు మరియు బజారు చివర గృహాల వారు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా ఈ విధంగా రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తున్న పంచాయతీ వారు పట్టించుకున్న పాపానాపోలేదని విమర్శిస్తున్నారు. గ్రామ కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనం లేకపోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. ఎండలకు తట్టుకోలేక రోగాలు పాలవుతున్న ప్రజలకు గ్రామ కార్యదర్శి అసమర్థత వల్ల ఇంకా రోగాలు ప్రబలుతున్నాయని, మా గోడు పట్టించుకునే నాధుడే లేక పోయాడని కాలనీవాసులు బాధపడుతున్నారు. అయ్యా కార్యదర్శి తమరు ఎక్కడున్నారు? ఫోన్ చేస్తే ఫోన్ ఎత్తరు, సమాధానం ఉండదు, తమరు ఒకసారి పాత సినిమా హాలు ఎదరు మెయిన్ బజార్లో చివరకు వచ్చి

చూడండి, ఇలాంటి ప్రదేశంలో మీరు తిరుగుతారా అని ప్రజలు ఆక్రోశాన్ని వెల్లబుచ్చుతున్నారు. గతంలో ఎంపీడీవో ఘంటా శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేయగా హడావిడిగా ఇద్దరు వ్యక్తులు వచ్చి ఏదో కొద్ది పాటి మరమ్మత్తులు చేసి ఆ ఒక్క రోజుకు మురుగునీరు రోడ్డుపైకి రానివ్వకుండా చేసి వెళ్లిపోయారే కానీ, దానికి శాశ్వత పరిష్కారం ఇంతవరకు చేయలేదని విమర్శిస్తున్నారు. మురుగునీరు రోడ్డుపైకి వస్తుందని కార్యదర్శికి ఫిర్యాదు చేయటానికి ఫోన్ చేస్తే, ఎప్పుడో ఒకసారి ఫోన్ రిసీవ్ చేసుకుని అందరూ ఇంటి పన్ను కట్టండి చేస్తాను అని మాట్లాడుతున్నాడని, మరి ఇంటి పన్ను కట్టిన వారు కూడా ఈ మురుగు కాలువలో గుండానే నడుస్తూ ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. మరి దీనికి మీ సమాధానం ఏమిటి అని కార్యదర్శిని మీ మురుగు నీరు వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంటి పన్నులు కట్టిన వారికైనా కార్యదర్శి పని చేయాలి కదా అని ప్రశ్నిస్తున్నారు. ప్రజలు మురుగునీరులో నడుస్తూ కాళ్ళకు అంటు రోగాలు తెచ్చుకుంటున్న పంచాయతీ వారికి ఏమీ పట్టడం లేదని తీవ్రంగా విమర్శిస్తున్నారు. పంచాయతీ సర్పంచుల పదవీకాలం అయిపోయిన పిదప ప్రత్యేక అధికారులను నియమించిన, కనీసం ప్రత్యేక అధికారులు కూడా ఇలాంటి వాటిపై దృష్టి పెట్టడం లేదని మురుగునీరు వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకొని మురుగునీరు వీధిలోకి రాకుండా చేయవలసిందిగా కోరుతున్నారు.

నూతన గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

చీమకుర్తి,మే 17 (మనసులో మాట).. ఆదివారం నాగులుప్పలపాడు గ్రామంలో కొండపి హరిబాబు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బి. ఎన్. విజయ్ కుమార్ ఎయమ్సీ డైరెక్టర్ కొనిజెటి ధనుష్ ,జనసేన నాయకులు, తాతినేని రాము , పల్లపోతు సాయి చరణ్ ,నన్నూరి శ్రీనివాసరావు ,నాగేశ్వరరావు , నాగరాజు ,తదితరులు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు గా ఆకుల

నందిగామ మే 17 మనసులో మాట.. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు గా ఆకుల వెంకట నారాయణ ఆదివారం నియమితు లయ్యారు. ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం లో ఆదివారం జరిగిన ఎపిడబ్ల్యుజెఎఫ్ ఎన్టీఆర్ జిల్లా మహాసభలలో ఎవి నారాయణ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి ఆంజనేయులు చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఎ,వి నారాయణ ఎపిడబ్ల్యుజెఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల జిల్లా లోని పలువురు పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎవి నారాయణ జిల్లా మహాసభలలో మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా లో జర్నలిస్టు ల సమస్యలు, ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని కోరారు. నందిగామలో జర్నలిస్టు మిత్రులకు ఇల్ల స్థలాలు ఇవ్వాలని, జర్నలిస్టు సమస్యలపై యూనియన్ నాయకులతో కలిసి పని చేయటం జరుగుతుందని తెలిపారు. నందిగామలో జర్నలిస్టు లకు ఫెడరేషన్ అండగా వుంటుందని తెలిపారు. ఎవి నారాయణ ఎపిడబ్ల్యుజెఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు గా నియమితులు కావటం పట్ల నందిగామ జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపల్లె పురపాలక సంఘంని 36 వార్డులుగా...

రేపల్లె మే 17మనసులోమాట.. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల అధికారులతో చర్చించి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన విడుదల కావడంతో పట్టణంలో వార్డుల విభజన నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు ఆదివారం తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని రేపల్లె పురపాలక సంఘంలో గతంలో 28 వార్డులు ఉండగా వాటిని 36 వార్డులుగా విభజించడం జరిగిందని. వార్డుల ముసాయిదా నోటిఫికేషన్ను తాసిల్దార్ కార్యాలయం ఆర్డీవో కార్యాలయం మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ప్రజల సందర్శనార్థం నోటిస్ బోర్డులో ఉండడం జరిగింది. ఎటువంటి అభ్యంతరాలు ఉన్న మున్సిపల్ కార్యాలయంలో తెలియజేయాలని తెలియజేశారు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 64 ప్రకారం విభజన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అభ్యంతరాలు ఉన్న ఎడల తెలియజేయాలని కోరారు

తమిళనాడు పాఠశాల విద్యా ప్రణాళికలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర హైకోర్టు కీలక ఆదేశం

నందిగామ మే 17 మనసులో మాట.. నందిగామ బార్ అసోసియేషన్ ప్యానల్ అడ్వకేట్ కురగంటి రాంబాబు తమిళనాడు పాఠశాల విద్యా ప్రణాళికలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను ఆయన చేసిన కృషిని పాఠ్యాంశాల్లో ప్రవేశపెట్టాలని మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేయటం శుభ పరిణామం అని నందిగామ బార్ అసోసియేషన్ ప్యానల్ అడ్వకేట్ కురగంటి రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు లో టీవీకే పార్టీ అధినేత దళిత జాతి ముద్దుబిడ్డ జోసఫ్ విజయ్ పార్టీ స్థాపించిన రెండు సంవత్సరములలోనే ప్రభుత్వం ఏర్పాటుచేసిన వెంటనే హైకోర్టు ఈ తీర్పు ఇవ్వడం అనేది శుభ పరిణామం అని ఇది యావత్ దళిత జాతి గర్వించదగిన విషయమని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యొక్క జీవిత చరిత్రను ఆయన చేసిన కృషిని పాఠ్యాంశాల్లో ప్రవేశపెట్టాలని రాష్ట్ర

ప్రభుత్వాన్ని ఆదేశించటం యావత్ దళిత జాతికి గర్వకారణం అని, 3 వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు అనుగుణంగా అంబేద్కర్ జీవిత విశేషాలు, రాజ్యాంగ రచనలు, ఆయన పాత్ర సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటం పాఠ్యాంశాలలో చేర్చాలని కోర్టు సూచించడం చరిత్రలో లిఖించదగిన విషయమని దీనిని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్ తరాలకు అంబేద్కర్ ఆశయాలు రాజ్యాంగ విలువలు సమానత్వ భావన అందించాలన్న ఉద్దేశంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకోవడం పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో సామాజిక చైతన్యం, రాజ్యాంగంపై అవగాహన పెంచడానికి ఈఆదేశం దోహదపడుతుందని రాంబాబు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అదే మారుగా తమిళనాడు ప్రభుత్వం హైకోర్టు ఆదేశాలను స్వాగతించి త్వరలోనే పాఠ్య పుస్తకాల కమిటీతో చర్చించి మార్పులు తెస్తామని తెలిపాయని, ఒక తమిళనాడు ప్రభుత్వమే కాకుండా యావత్ భారత దేశంలోని అన్ని రాష్ట్రాలు ఇదే తరహా విధానాన్ని అమలు చేయాలని భవిష్యత్ తరాలకు అంబేద్కరిజాన్ని అమలు జరిగేలా చూడాలని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ విషయంపై దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా రాంబాబు విజ్ఞప్తి చేశారు.

సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత పాదరక్షలు పంపిణీ

తెనాలి మే17(మనసులో మాట).. మండలంలోని కఠెవరం గ్రామంలో సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత చెప్పుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ మాజీ సర్పంచ్ బండికళ్ల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై నిర్వాసితులకు పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో కాల్వ కట్టపై నివసిస్తున్న పేద ప్రజలకు ఉచితంగా పాదరక్షలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సొసైటీ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా పేదలు,

చిన్నారులు, విద్యార్థులకు లబ్ధిచేకూర్చడం హర్షణీయమన్నారు.
సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కంకిపాటి రమేష్ కుమార్ మాట్లాడుతూ తమ వ్యాపార లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు.
కఠెవరం గ్రామానికి చెందిన సుమారు 200 మంది వృద్ధులు, మహిళలు, చిన్నారులకు పాదరక్షలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు బి. సుధాకర్, కాకుమాను కిరణ్, అవధానుల సత్యదేవ్,పూర్ణ, ఎపిడబ్ల్యుజెఎఫ్ తెనాలి డివిజన్ అధ్యక్షులు అంబటి శ్యామ్ సాగర్, హైకోర్టు న్యాయవాది వింజమూరు ప్రసాద్, నేరెళ్ల తేజ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సోషల్ మీడియా విభాగ జాయింట్ సెక్రటరీగా దాసరి కిరణ్

- మొదటి పేజీ తరువాయి సంక్షేమ పథకాలు ప్రజలకు విస్తృతంగా చేరేలా కృషి చేస్తానన్నారు. అదేవిధంగా యువతను పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షించేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి లలిత కుమారి,రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గాదె శివరామ కృష్ణారెడ్డి, భట్టిప్రోలు మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు,భట్టిప్రోలు టౌన్ ప్రెసిడెంట్ కుందేటి రమేష్,రాష్ట్ర ఆర్.టి.ఐ విభాగం అధ్యక్షులు శేషాచలం పెద్దబుజ్జి, వేమూరు నియోజకవర్గ పంచాయతీ విభాగం అధ్యక్షులు బొల్లేదు ప్రతాప్, బాపట్ల జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు వాసిమళ్ల రోహిత్, మరియు జిల్లా,నియోజకవర్గ మండల స్థాయి ముఖ్య నాయకులు, వైయస్ఆర్సీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన జాయింట్ సెక్రటరీ దాసరి కిరణ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ధూళిపాళ్లలో ఇరువర్గాల ఘర్షణ

- మొదటి పేజీ తరువాయి వచ్చిన డబ్బు బచ్చు మనోహర్ తీసుకున్నాడు. మిగిలిన డబ్బును చెల్లించమని వత్తిడి చేసిన స్థలానికి చెందిన యజమాని మిగులు స్థలం అమ్ముడు పోక చెల్లించడంలో జాప్యం జరిగింది. 26 ఫిబ్రవరి 2026 తేదీన సేల్ డీడ్ ఉన్న బచ్చు మనోహర్, తాడువాయి ఉదయ్ విశ్వనాథ్ కలిసి గుంటూరు టౌన్ కు చెందిన కార్తికేయ ఇన్ ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ వంకుడావత్ భీమా నాయక్,వెంకటేశ్వర్లు నాయక్ కు 20 లక్షలకు అమ్మినారు. ఈ విషయంలో అసలు యజమాని ప్రశ్నించగా, నీవు డబ్బు సమయానికి చెల్లించ లేదు కావున నా అవసరాల కోసం అమ్ముకున్నానని సమాధానం చెప్పాడు. ఈ రోజు అనగా ఆదివారం స్థలాన్ని కొన్న పై ఇరువురు నాయకులు సర్వే పెట్టుకొనగా వీ ఆర్ ఓ సర్వేయర్ ని పిలువగా వచ్చిన అసలు యజమాని,ఫ్లాట్ స్థలము కొన్న యజమాని కానుగల శివనాగ బాబు వెళ్ళగా గొడవ జరిగింది. మాటా మాటా పెరిగి శివనాగ బాబు, వంకూడావత్ భీమా నాయక్ కొట్టుకున్నారు. శివనాగ బాబు మెడపై చిన్న దూకుడు గాయం అయిందని పోలీసులు తెలిపారు. ఇరువురు సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్లో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. ఈ మేరకు సత్తెనపల్లి రూరల్ ఎస్సై అమీనుద్దీన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రేపల్లె మే 17 మనసులో మాట.. పట్టణంలో విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం సోమవారం పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ డీఈ దాసరి శ్యాంసుందర్ బాబు తెలియజేశారు డిఇ మాట్లాడుతూ సోమవారం ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు రేపల్లె టౌన్ లో 33కెవి క్రొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నందున అరవపల్లి రోడ్డు , డొంక రోడ్డు, ఆర్ కే మోడల్ స్కూల్ ఏరియా, వక్కపొడి రాజు ఏరియా, పల్స్ హాస్పటల్ హౌసింగ్ బోర్డు కాలనీ, ఇసుకుపల్లి , గరువురోడ్ ఉప్పు రోడ్డు, నిజాంపట్నం రోడ్డు, మజీద్ సెంటర్ నుంచి బస్టాండ్, బసవేశ్వర థియేటర్ వరకు రోడ్డుకి ఇరువైపుల మరియు బేతపూడి , ఉప్పుడి, ఉయ్యూరువారిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుంది. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా కోరినారు.

ప్రత్తిపాడు, మనసులో మాట, మే 17.. ఉపాధ్యాయుల కోర్సు చదివి, ప్రభుత్వ ఉద్యోగం రాక, ప్రైవేటు పాఠశాలల్లో చేరిన నిరుద్యోగులను ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు దోచుకుంటున్నాయి. అడ్మిషన్ల పేరుతో వేధిస్తున్నాయి. కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ శ్రమదోపిడికి పాలు పడుతున్నాయి. అరకోర వేతనాలు ఇస్తూ మండే ఎండల్లో అడ్మిషన్ల కోసం ఇంటింటికి తిప్పుతున్నాయి. ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయకపోతే ఉద్యోగానికి భరోసా ఉండదు. పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రైవేటు టీచర్లు విద్యార్థులు తల్లిదండ్రులనే కాక తమకు తెలిసిన వారిని, పరిచయము ఉన్న వారిని, బంధువులను అడ్మిషన్ల కోసం బతిమిలాడాల్సిన పరిస్థితి. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వేధింపులు, బాధలు, ఆయా పాఠశాలల టీచర్లు అడ్మిషన్ల కోసం ఎండల్లో తిరుగుతూనే ఉన్నారు. అయినా విద్యాశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోలు కేవలం కాగితానికే పరిమితం ఫలితానికి మాత్రం శూన్యం. ఇప్పటివరకు కొన్ని ప్రైవేటు స్కూల్స్ ప్రైవేటు ఉపాధ్యాయులకు ఏప్రిల్ నెల శాలరీ కూడా ఇవ్వలేదు అంటే ఎంత దౌర్భాగ్యస్థితి ఒక్కసారి ఆలోచించుదాం. శాలరీ కోసం పాఠశాల ప్రిన్సిపాల్ కి కొన్ని వందల సార్లు ఫోన్ చేసినా ఆ ప్రిన్సిపల్ ఫోన్ కూడా లిఫ్ట్ చేయరు. స్కూల్ దగ్గరికి వెళితే మీరు అడ్మిషన్ చేస్తే శాలరీ ఇస్తాం లేకపోతే ఇవ్వం అని సేల్స్ మేనేజ్ జీవితం కంటే కూడా అతి తక్కువ జీతానికి కూడా పనిచేస్తున్నటువంటి కొంతమంది ఉపాధ్యాయులు బాధపడుతున్నారు. చాప్లిస్ పట్టుకొని బ్లాక్ బోర్డ్ మీద ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న టీచర్లు వాళ్ళ జీవితాన్ని మాత్రం శూన్యంలోకి తీసుకెళుతున్నారు. ఈ కారణం ఎవరు పాఠశాల యాజమాన్యమా, లేక ఆ యాజమాన్య మీద చర్యలు తీసుకొని ప్రభుత్వ యంత్రాంగమా, బతకలేక బడిపంతులు నాటి మాట, బతకనీర్చిన పాఠశాల యాజమాన్యం నేటి మాట. ఇచ్చే తక్కువ శాలరీ అయినా టయానికి ఎన్ని స్కూల్స్ ఇస్తున్నాయి అంటే గుంటూరు నగరంలో వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు.

పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలి

రేపల్లె మే 17 మనసులోమాట.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పెట్రోల్ డీజిల్ రేట్లు పెంచమని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక రేట్లు పెంచడాన్ని నిరసిస్తూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు వైఎస్ఆర్సిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు 18/05/2026 అనగా సోమవారం రోజున రేపల్లె నియోజకవర్గం లో నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ నాయకత్వంలో నియోజకవర్గంలోని వివిధ గౌరవప్రదమైన పదవుల్లో ఉన్ననాయకులు, కార్యకర్తలు, రైతులు ప్రజలు ఉదయం 10 :00 గంటలకు బస్టాండ్ సెంటర్లోని వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహం వద్ద నుంఆర్డిఓకార్యాలయం వరకు నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం ఆర్డిఓ కు వినతిపత్రం అందజేయడం జరుగుతుంది. అని తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం పెట్రోల్ డీజిల్ ధరలను పెంచడం వారి కుటిల రాజకీయానికి నిదర్శనం అన్నారు ఎన్నికల ముందు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి ఉంటే ఎన్నికల అనంతరం పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారని అదేమని ప్రశ్నిస్తే ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్నారని పీటా మోహన్ వివరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ చెరుకుపల్లి లో వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగింది ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటల నుండి చెరుకుపల్లి పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటామని తెలియజేశారు

ప్రజల భాగస్వామ్యంతోనే నేర రహిత సమాజం

- మొదటి పేజీ తరువాయి లక్ష్మి శ్రీనివాస కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 40 సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ప్రారంభం కావడం అభినందనీయమని తెలిపారు. ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ భద్రతా వ్యవస్థ ఇతర కాలనీలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఆదివారం 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మి శ్రీనివాస కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను డిఎస్పీ మహమ్మద్ మొయిన్ ఘనంగా ప్రారంభించారు. కాలనీ వ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ కెమెరాలు ప్రజల భద్రతకు తోడ్పడటమే కాకుండా నేరాల నియంత్రణలో కీలకంగా ఉపయోగపడనున్నాయి. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు మరింత ఫలప్రదంగా మారుతున్నాయని తెలిపారు. కాలనీవాసులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భద్రతపై చొరవ చూపడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ ప్రాజెక్టుకు సారథ్యం వహించిన ప్రముఖ సామాజిక కార్యకర్త, కాలనీ ప్రతినిధి బత్తుల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ... కాలనీ ప్రజల సహకారం, దాతల విరాళాలతో ఈ సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ అధికారుల సూచన మేరకు కాలనీని మరింత సురక్షితంగా మార్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈనాటి కార్యక్రమంలో దాతలు, కాలనీ మహిళలు, యువకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బాపట్ల జిల్లా కేంద్రంలో భద్రపరిచిన ఈవీఎంలు గోదాము కలెక్టర్ పరిశీలన

బాపట్ల మే 17 మనసులో మాట: ఈవీఎంల నిర్వహణలో పారదర్శకత, భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం బాపట్ల జిల్లా కేంద్రంలో భద్రపరిచిన ఈ వి ఎం ల గోదామును జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ తో కలసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా తో మాట్లాడుతూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఈవీఎంలను అత్యంత భద్రతతో భద్రపరచడం జరిగిందని తెలిపారు. గోదాములో 24 గంటల భద్రతా పర్యవేక్షణ కొనసాగుతోందని, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ద్వంద్వ తాళాల విధానం, అగ్నిమాపక పరికరాలు తదితర అంశాలను ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రతి నెల మరియు ప్రతి మూడు నెలలకు ఒకసారి గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎం గోదామును ఓపెన్ చేసి పరిశీలించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయిన తర్వాత కూడా ఈవీఎంల నిర్వహణలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా, తహశీల్దార్ షేక్ సలీమా,ఎలెక్షన్ పర్యవేక్షకులు షఫి తదితరులు ఉన్నారు.

పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు

- సలసల కాగుతున్న వంట నూనెల ధరలు - కూరగాయల ధరలకు సైతం రెక్కలు

- పశ్చిమాసియా యుద్ధం బూచిగా చూపే నిత్యావసరాల ధరల పెంపు

క్రోసూరు మే 17 (మనుసులో మాట).. పశ్చిమాసియ ప్రాంతంలో జరుగుతున్న యుద్ధాన్ని బూచిగా చూపించి మార్కెట్లో నిత్యవసరాల ధరలను అమాంతం పెంచేస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల జీవనం కష్టంగా మారుతోంది. పప్పుల నుంచి నూనెల వరకు అన్ని రకాల వస్తువుల ధరలు పెంచేయడంతో పేద ప్రజలు విలవిలలాడిపోతున్నారు. ధరలను అదుపు చేయాల్సిన చంద్రబాబు ప్రభుత్వం గుడ్లప్పగించి చూస్తోంది. ఇదే అదునుగా వ్యాపారులు ధర లను అమాంతం పెంచేస్తూ నిలువునా దోచేస్తున్నారు. ధర లను కట్టడి చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. యుద్ధాన్ని బూచిగా చూపి అమెరికా – ఇరాన్ యుద్ధం వల్ల నూనెల

మధ్య దిగుమతి తగ్గిపోయిందని చెబుతూ వ్యాపారులు ధర.. లను పెంచేస్తున్నారు. కొం దరు వ్యాపారులైతే సిండికే ట్ గా మారి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వల్ల నూనె ధర లీటరుకు రూ.20 నుంచి రూ. 30 వరకు పెరిగిం నెత్తిన గుదిబండ పశ్చిమాసియా ఉద్రిక్తత కారణంగా ముఖ్యంగా హర్ముజ్ జలసంధి వద్ద రవాణా అంతరాయాలతో దేశంలో వంట గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది. ఇదే అదునుగా కొందరు గ్యాస్ సిలిండర్లను మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పామాయిల్ ధర లీటరుకు రూ.20, రిఫైండ్ ఆయిల్ ధర లీటర్ కు రూ.30 వరకు పెరిగింది. వివిధ రకాల పప్పుల ధరలు కూడా కేజీకి రూ.10 నుంచి రూ.20 వరకు పెంచేశారు.

ధరల కట్టడిలో విఫలం...

నిత్యావసర ధరలు రెండు నెలల నుంచి పెంచి సామాన్య లను దోచుకుంటున్నప్పటికీ యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ధరలను కట్టడి చేయా ల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అసలు వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు అటుగా కనీసం చర్యలు చేపట్టడం లేదన్న విమ ర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకిలా వ్యవహరిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఓవైపు పాలకులు యుద్ధప్రభావం ఏమీ లేదని చెబుతుంటేఏ మరోవైపు ఇలా ధరలు పెరగడం చూస్తుంటే అసలేం జరుగుతుందన్న ప్రశ్నలు సామాన్యుడిలో తలెత్తు తున్నాయి.

ఏం కొనేటట్టు లేం..

నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్యత రగతి వర్గాలకు చెందిన ప్రజల కొనుగోలు స్థితి పడిపోయి పూర్తిస్థాయిలో అందడం లేదు. ఇదిలా ఉండగానే మరో వైపు కమర్షియల్ సిలిండర్ ఏకంగా రూ.993 పెరిగింది. గ్యాస్ కొరత లేదని అధికారులు చెబుతున్నా గ్రామాల్లో గ్యాస్ కష్టాలు మాత్రం తప్పడం లేదు ధరలను నియం త్రించడంతోపాటు గ్యాస్ సరఫరా పై ప్రభుత్వ యంత్రాం గం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఓ ఇంటిపై గుంపుగా బైఠాయించిన కోతులు

కోతుల దండయాత్ర

- దాడులతో ప్రజలు బెంబేలు

క్రోసూరు మే 17 (మనుసులో మాట).. క్రోసూరు మండల కేంద్రం, పరిసర ప్రాంతాల్లో కోతులు బెడద తీవ్రమైంది. ఊళ్ల పై దండ యాత్ర చేస్తున్నాయి. ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయి. ముఖ్యంగా క్రోసూరులో వీటి బెడద ఎక్కువగా ఉంది. ఒంటరిగా బయటకు రాలేని పరిస్థితి. చిన్నారులు, వృద్ధులు భయాందోళన చెందుతు న్నారు. నాలుగేళ్లుగా కోతులు సంతతి విపరీతంగా పెరిగిందని గ్రామీణులు చెబుతున్నారు. ఊరంతా వానర సైన్యం మండల కేంద్రం క్రోసూరు లోని ఇందిరా కాలనీ, విద్యానగర్, పల్లెలో, మసీదు వెనుక బజార్లలో వీటి సంచారం ఎక్కువగా ఉంటోంది. మనుషులు ఉన్నా సరే తాపీగా ఇంట్లోకి చొరబడుతున్నాయి. ఎవరైనా అదిలిస్తే మీదకు వస్తున్నాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు చాల మంది కోతుల దాడి బారిన పడినట్లు ప్రజలు తెలిపారు. ఊరంతా కోతులమయం కావడంతో ఏం చేయాలో గ్రామస్థులకు అర్థం కావడం లేదు. పంచాయతీ అధికారులకు అర్జీలు అందజేసినా, నిధులతో. ముడిపడిన అంశం కావడంతో చర్యలు తీసుకోలేక పోతున్నారు. కోతులు పట్టేవారిని సంప్రదించి, ఊరికి దూరంగా అడవుల్లో వదిలి పెట్టేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

కారం చెడు రహదారిలో ప్రమాదం..

- కారు - ఆటో ఢీ

వేటపాలెం మే 17 మనసులో మాట.. బాపట్ల జిల్లా కారంచేడుచీరాల ప్రధాన రహదారిపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారంచేడు మండలంలోని అంబేద్కర్ కాలనీ సమీపంలో కారు, ఆటో ఢీకొనడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. చీరాల నుంచి కారంచేడు వైపు వెళ్తున్న ఓ కారు ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో ఆటో దెబ్బతినగా, అందులో ప్రయాణిస్తున్న పలువురు గాయపడినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్ సహాయంతో చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆంధ్రప్రదేశ్లో కూడా హైడ్రా చట్టాన్ని అమలు పరచికోనేరు పుష్కరిణి ని రక్షించండి

నందిగామ మే 17మనసులో మాట.. శివాలయం కి సంబంధించి కోనేరు ఉద్యమం ఈరోజు 24వ రోజు నందిగామ మున్సిపల్ కార్యాలయం ముందు శ్రీ విజ్ఞేశ్వర స్వామి దేవాలయం వద్ద నుండి రైతుపేట విజయ టాకీస్ రోడ్ పరువేట మండపం త్రిశూలాలతో ర్యాలీ నిర్వహించారు. చిలికి చిలికి గాను వాలా మారుతున్న నందిగామ కోనేరు పుష్కరిణి విషయం గత కొన్ని రోజులుగా దీనిపై ధర్నా చేస్తున్న విషయం విధితమే కానీ అధికారులు నుండి ఎటువంటి స్పందన కనపడటం లేదని పుష్కరిణి జాయింట్ యాక్షన్ కమిటీ ఆరోపిస్తుంది ఇటీవల కాలంలో కోనేరు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించడం జరిగింది . అయితే ఆ నిధులను పుష్కరిని అభివృద్ధికి ఉపయోగించాలని నందిగామ చెందినటువంటి ప్రముఖులు పారేపల్లి సాయిబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో కూడా హైడ్రా చట్టాన్ని అమలు పరచాలని కోనేరు పుష్కరిణి, ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులను కాపాడాలని ఈ సందర్భంగా కోరారు ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు తొరలికొండ సీతారామయ్య, కామేశ్వరరావు, కోనేరు పుష్కరిణి జాయింట్ యాక్షన్ కమిటీ పాల్గొన్నారు

20న ఆందోళనలలో ఉపాధి హామీ కూలీలు పాల్గొని జయప్రదం చేయండి

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి. రవిబాబు

క్రోసూరు మే 17 (మనుసులో మాట).. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి ఈనెల 20వ తేదీ గ్రామ సచివాలయాలు వద్ద జరగనున్న ఆందోళనలలో ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పలనాడు జిల్లా కార్యదర్శి జి రవిబాబు అన్నారు. మండలంలోని ఊటుకూరు గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశంలో వేతనదారులతో మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని కి తూట్లు పొడుస్తుందని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తన వాటాను తగ్గించుకొని రాష్ట్ర ప్రభుత్వాల మీద భారాల వేయటం, నిషేధ కాలాన్ని పెట్టటం ద్వారా ఉపాధి పని గ్యారంటీ లేకుండా చేస్తుందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో 2024 25 ఆర్థిక సంవత్సరంలో 10648 కోట్ల రూపాయలు ఖర్చు చేయగా ఈ ఆర్థిక సంవత్సరంలో కేవలం 738 కోట్ల రూపాయల మాత్రమే ఖర్చు చేసే అవకాశం ఉంటుందని అంచనాలు వేయడం అంటే పని గ్యారంటీ ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు అంటే పని దినాలు125 రోజులకు పెంచుతున్నట్టు ప్రకటించి, కేటాయించిన బడ్జెట్ తగ్గించటం అంటే ఉపాధి హామీ వేతన దారులను ప్రభుత్వాలు మోసం చేయటమే అని ఆయన విమర్శించారు. ఇటువంటి మోసాలను అరికట్టాలని 20వ తేదీ గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద జరగనున్న ఆందోళనలలో ఉపాధి హామీ వేతన దారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేతన దారులు మస్తాన్ నాగరాజు, జమాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం కొనవద్దని పొదుపు మంత్రం జపిస్తున్న భారత ప్రధాని

కారంపూడి, మే 17, (పల్నాడు జిల్లా) మనసులో మాట : దేశ ప్రజలను సంవత్సరం పాటు బంగారం కొనవద్దని, పెట్రోల్, డీజిల్ లను పొదుపుగా వాడాలని పొదుపు మంత్రం జపిస్తున్న భారత ప్రధాని మాటలకు నవ్వొస్తుందని కారంపూడి మండల వైఎస్సార్ సీపీ నాయకులు బొగ్గవరపు నాగరాజు అన్నారు. ప్రపంచం మొత్తం బంగారం మీద పెట్టుబడులు పెడుతుంటే,మన భారత ప్రధాని మాత్రం బంగారం కొనొద్దని ప్రజలకు మనవి చేస్తున్నారని అన్నారు. బంగారం పై పెట్టుబడి పెట్టి బంగారాన్ని నిలువ చేసి డబ్బుని బ్లాక్ చేసే కంటే దేశంలోనే ఇతరాలపై పెట్టుబడి పెట్టి దేశ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు సహకరించాలని చెప్తున్నారని అన్నారు.ఒకరకంగా ప్రధాని చెప్పేది నిజమే అయినా, ప్రజలు బంగారం కొనుగోలు చేయటం వలన దేశ ఆర్థిక పరిస్థితి దెబ్బతినడం లేదని, ఏ వ్యాపారం చేసిన వచ్చే కొద్దిపాటి లాభాలలో ఆదాయపు పన్ను, వృత్తి పన్నని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల జిఎస్టి లని ఈ పన్నుల బాదుడు తోనే చిరు వ్యాపారుల నడ్డి విరిగిపోతుందని, ఇలాంటి సమయంలో వ్యాపారాలు పెట్టి, చిన్నాచితక కంపెనీలు పెట్టి నష్టపోయే కంటే, బంగారం పై పెట్టుబడి పెట్టి, ఆదాయం పెంచుకోవటం ఉత్తమమైన మార్గంగా చిరు వ్యాపారులు, కొద్దిపాటి ఆదాయ ఒనరులు ఉన్న వ్యక్తుల ఆలోచన చేస్తున్నారని, అందుకే ఈ విధంగా బంగారంపై పెట్టుబడులు పెడుతున్నారని అన్నారు. అసలు దేశ ఆర్థిక పరిస్థితి ఇంత దివాళ కోరుతనంగా మారటానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కొన్ని



నిర్ణయాలు కాదా అని ప్రశ్నించారు?. ఒక సామాన్య రైతు బ్యాంకుల వద్ద వ్యవసాయపు రుణాలు కానీ, మరి ఇతర రుణాలు తీసుకున్న వారి ముక్కులు పిండి, రైతులను పలు విధాలుగా హింస పెట్టి చిన్నపాటి మొత్తాలను వసూలు చేస్తున్న ఈ బ్యాంకింగ్ వ్యవస్థ, వేలాది కోట్ల రూపాయలను బడా బాబుల వ్యాపారాలకు రుణాల రూపేనా అప్పులు ఇచ్చి, వారి వద్ద నుండి వసూలు చేయటం చేతకాక లక్షల కోట్ల రూపాయలను మొండి బకాయిలు కింద చూపిస్తూ, ఆ అప్పులను మాఫీ చేసినప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని ప్రధానమంత్రి కి తెలీదా అని ప్రశ్నించారు?. అప్పులు ఎగవేత దారులైన బడాబడా వ్యాపారస్తులకు, పారిశ్రామికవేత్తలకు, దొడ్డిదారుల్లో ఇంకా రుణాలు ఇస్తూనే ఉన్నారని ఈ విషయం ప్రధానికి తెలియదా అని సూటిగా ప్రశ్నించారు?. బ్యాంకుల వారు కూడా బడా నేతల వద్దకు, పారిశ్రామికవేత్తల వద్దకు వెళ్లకుండా, సామాన్య రైతులను, చిరు వ్యాపారులను నానా ఇబ్బందులు పెట్టి రుణాలు వసూలు చేస్తున్నారన్నారు. 2014 ముందు పరిస్థితులతో పోల్చుకుంటే ఈ 12 సంవత్సరాలలో దేశం ఎంతో ఆర్థికంగా వెనకబడిపోయిందని దీనికి బాధ్యులు ఎన్డీఏ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ప్రపంచం మొత్తం కరోనాతో బాధపడుతుంటే పేద ప్రజలకు గాని కరోనా బాధితులకు గాని ఎటువంటి సహాయం చేయలేక,వారి చావుకు వారిని వదిలేసి, కరోనా సమయంలో లాక్ డౌన్ల వల్ల వ్యాపారస్తులు వ్యాపారాలు దెబ్బతిని, చిన్న చిన్న పారిశ్రామికవేత్తలను ఓపక్క జిఎస్టి తో, మరోపక్క ఇతర పన్నులతోనూ కృంగదీసి ఇప్పుడు ప్రభుత్వాలు పొదుపు మంత్రాలు చదివితే, నష్టపోయిన వ్యాపారస్తులు పారిశ్రామికవేత్తలు ఎందుకు పట్టించుకుంటారని అన్నారు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ప్రతి వస్తువు మీద టాక్స్ ల మీద టాక్సు వేసి వసూలు చేసిన సొమ్మంతా ఏమైందని విమర్శించారు. ఇప్పటికైనా బకాయిల ఎగవేత దారుల నుండి రుణాల రూపేణా తీసుకున్న లక్షలాది కోట్ల రూపాయలను తిరిగి వసూలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని, సామాన్య ప్రజలపై ఇంకా పన్నుల ద్వారా భారాన్ని మోపకుండా చూడాలని మనవి చేశారు.

ఎంఆర్పీకి మించి సిగరెట్లు, గుట్కా విక్రయాలు

- ధూమపాన ప్రియుల జేబులకు చిల్లు

పెదకూరపాడు, మే 17 (మనసులో మాట):

పెదకూరపాడు నియోజకవర్గంలో సిగరెట్లు, కైని,గుట్కా తదితర పొగాకు ఉత్పత్తులను ఎంఆర్పీ కంటే రూ.10 నుంచి రూ.15 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ పెరిగినప్పటి నుంచి వ్యాపారులు తమ ఇష్టానుసారం రోజుకో ధర నిర్ణయిస్తూ ధూమపాన ప్రియులను దోచుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాలా దుకాణాల్లో సిగరెట్ ప్యాకెట్లపై ఎంఆర్పీ స్పష్టంగా లేకపోవడం, ఉన్నా దానికంటే ఎక్కువ వసూలు చేయడం సాధారణంగా మారిందని వినియోగదారులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నపాటి టీ దుకాణాలు, పాన్ షాపుల్లో ఈ అధిక ధరల వసూళ్లు ఎక్కువగా జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

ఒకే బ్రాండ్ సిగరెట్‌కు ఒక్కో దుకాణంలో ఒక్కో ధర చెప్పడం గమనార్హం. గుట్కా, కైనీస్ వంటి పొగాకు ఉత్పత్తుల విషయంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోందని పలువురు పేర్కొంటున్నారు. జీఎస్టీ పెరిగిందనే కారణంతో వ్యాపారులు అదనపు లాభాలు పొందేందుకు వినియోగదారుల బలహీనతను క్యాష్ చేసుకుంటున్నారని అంటున్నారు.

ఈ వ్యవహారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చీరాల ఆర్టీసీ బస్టాండ్లో హైయర్ బస్ డ్రైవర్‌పై కత్తి దాడి

వేటపాలెం మే 17 (మనసులో మాట).. బాపట్ల జిల్లా చీరాల ఆర్టీసీ బస్టాండ్లో ఆదివారం ఉద్రిక్త ఘటన చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న ఆర్టీసీ హైయర్ బస్ డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేయడంతో స్థానికంగా కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే.. చీరాల జయంతిపేటకు చెందిన హరీశ్ ఆర్టీసీ హైయర్ బస్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. డ్యూటీలో భాగంగా బస్టాండుకు చేరుకున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు ఒక్కసారిగా అతనిపై కత్తితో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యాశాలకు తరలించారు. ప్రస్తుతం అతనికి వైద్య చికిత్స కొనసాగుతున్నట్లు సమాచారం. దాడికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

హిందువులలో ఐక్యత సమరసత భావం పెంపొందాలి

పర్యావరణాన్ని రక్షించుకోవాలి - జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు

కొల్లూరు : మే 17: (మనసులో మాట).. కొల్లూరు లో ధార్మిక సమరసతా ఫౌండేషన్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ధర్మ ప్రచారక్ హేమ శంకరరావు హాజరయ్యారు ఈ సందర్భంగా ధర్మ ప్రచారక్ హేమ శంకరరావు మాట్లాడుతూ భారతీయులకు భారతదేశానికి హిందూ ధర్మం ఆత్మ వంటిదని అలాంటి ధర్మాన్ని మనం రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాముడు రామాయణం మన కుటుంబ వ్యవస్థ ధర్మ మార్గం మార్గదర్శనం చేస్తే

శ్రీకృష్ణుని భగవద్గీత మానవుని కర్తవ్యం ముక్తి మార్గాన్ని తెలియజేసింది అన్నారు. హిందువులలో ఐక్యతను సాధిస్తూ గడప లోపలే కులం గడప దాటితే హిందువులం అనే భావన పెంపొందాలి అని అన్నారు. కుటుంబ వ్యవస్థ రక్షించుకుంటూ పౌర హక్కులతో పాటు విధులు తెలుసుకుంటూ పర్యావరణ పరిరక్షణ చేసి భావితరాలకు మంచి సంస్కృతి సాంప్రదాయాలతో పాటు మంచి పర్యావరణాన్ని అందజేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో బందారు శ్రీనివాసరావు క్రాప రవికుమార్ తమ్మన సాంబశివరావు నూతలపాటి సాంబశివరావు చిట్టా రాముడు మామిడి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఏ పార్టీ ప్రభుత్వమైనా మన రాజ్యాంగాన్ని అనుసరిస్తూ పరిపాలన అందిస్తే చాలు

ప్రజలు హాయిగా ఎవరి పనులు వారు చేసుకుంటారు - రామకోటేశ్వరరావు

నాదెండ్ల మే 17మనసులోమాట.. నేడు అధికారంలో ఉన్న బిజెపి నాయకులు మనం హిందువులం మనది సనాతన ధర్మం వాళ్లు ముస్లింలు వీ రు క్రైస్తవులు అంటూ దేశం నలుమూల ప్రస్తావనలు తీసుకొస్తున్నారు.దేశ సమైక్యతకు భంగం కలిగిస్తుందని జిల్లా కిసాన్ సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి బొట్లపాటి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ అన్నారు మండలంలోని సాతులూరు గ్రామంలో ఆదివారం నాడు మాట్లాడుతూ మన దేశం స్వాతంతర్యానికి పూర్వం కుల వివక్షత మత వైరుధ్యాలు ఒకే మతంలో వైరుధ్యాలు అంటరానితనం అనైక్యత సమస్యలతో ప్రజా జీవనం కొనసాగుతూ ఉండేది జమీందారులు రాజులు వారి వారి ప్రాంతాల్లో అజమాయిషి చేస్తూ ఉండేవారు వారి మధ్య కూడా వైరుధ్యాలు కొనసాగుతూ ఉండేవి. దేశంలో ఈ

పరిస్థితులను ఆసరాగా తీసుకుని ముస్లింలు 500 సంవత్సరాలు బ్రిటిష్ వారు 200 సంవత్సరాలు మన దేశాన్ని పరిపాలించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల సారధ్యంలోతరతమ భేదాలు లేకుండా భారతీయులందరూ ఏకమై స్వతంత్ర ప్రజాస్వామ్య భారతదేశాన్ని సాధించుకున్నాము. ఏ పార్టీ అధికారంలో ఉన్నా మన రాజ్యాంగం ప్రామాణికంగా పరిపాలన సాగుతూ వస్తున్నది. ఇదేమి చిత్రమోకాని నే డు బిజెపి ప్రభుత్వం మాది సనాతన ధర్మం అంటారు, వాళ్లుముస్లింలు వీళ్లు క్రైస్తవులు అంటారు. ఈ ప్రస్తావనలు మన ప్రజాస్వామ్య దేశానికి అవసరం లేదు. తోటి వారి అభిమతాన్ని గౌరవిస్తూ సోదర భావంతో ప్రజా జీవనానికి చేయూతనివ్వాలి. భిన్నంగా బిజెపి ప్రభుత్వ విధానాలు ఆమోదయోగ్యం కాదు ప్రత్యేక ప్రాధాన్యతలు ప్రజలకు అవసరం లేదు రాజ్యాంగాన్ని అనుసరిస్తూ ప్రభుత్వాలు కొనసాగితే సర్వదా శ్రేయస్కరం.

దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

కందుకూరు మే 17, (మనసులో మాట).. ప్రకాశం జిల్లా కందుకూరు డివిజన్ జీవనజ్యోతి దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో జెడిబియమ్ టౌన్ బాప్టిస్ట్ చర్చి దగ్గర మజ్జిగ పంపిణీ. ఈ సందర్భంగా సేవాసమితి కార్యదర్శి శీలం వెంకటేష్ మాట్లాడుతూ తీవ్రమైన ఎండలు భరించలేని ఉష్ణోగ్రతల మధ్య రోడ్డుపై నిస్సహాయంగా నడుస్తున్న యాచకులకు, బాటసారులకు, చిన్నారులకు, దివ్యాంగులకు, చమటతో తడుస్తూ కష్టపడుతున్న శ్రామికులకు, దాహంతో అలమటిస్తున్న సామాన్య ప్రజలకు ప్రభువైన యేసుక్రీస్తు బోధించిన ప్రేమ సేవ తత్వాలను ఊపిరిగా చేసుకొని సమాజంలో నిరంతరం అభాగ్యులకు తోడుగా నిలిచే జీవనజ్యోతి దివ్యాంగ వికాస సేవా సమితి ఆదివారం దాతల సహకారంతో చల్లని మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ బాబు, మైత్రి నితీష్ వేణుబాబు, శివ, చరణ్ తేజ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు

బడిబాట పట్టిన ఉపాధ్యాయులు

నాదెండ్ల మే 17 : మనసులోమాట.. మండలంలోని చిరుమామిళ్ల నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు మేకల కిషోర్, ఉపాధ్యాయులు పాఠశాలలో హాజరు శాతం పెంచేందుకు విద్యార్థుల కోసం గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మేకల కిషోర్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల కన్నా ఈరోజు ప్రభుత్వ పాఠశాలలో కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాష్ట్రంలో అగ్రస్థానంలో నిరుస్తుంది అన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించినట్లయితే ప్రభుత్వ అమలు చేస్తున్న విద్యార్థులకు పలు సంక్షేమ పథకాలు అమలు అవుతాయి అన్నారు. విద్యార్థులకు నోట్ బుక్స్, షూ, యూనిఫామ్ తో పాటు మధ్యాహ్న భోజన పథకం అందిస్తున్నారు అన్నారు. తమ పిల్లలను అధిక ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు గ్రామ పెద్ద యన్నం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరైన ఇంటి స్థలం పత్రాలు ఉన్న పొజిషన్ పత్రంకి 30,000 డిమాండ్ చేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులు

చీరాల మే 17: (మనసులో మాట).. ముఖ్యంగా గ్రామాలలో వారసత్వం భూములను కుటుంబ సభ్యులు భాగాలుగా పంచుకుని రిజిస్ట్రేషన్ చేసుకుంటూ ఉంటారు. అందులో ఎంతో ఆశతో గృహం నిర్మించుకోవాలని కోరికతో పనులను ప్రారంభించుకుంటారు. ఆర్థిక స్తోమతల వల్ల గృహం నిర్మించుకునే డబ్బులు లేక బ్యాంకుల్లో రుణాలు పొందాలని అనుకుంటారు. ఒరిజినల్ రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నా సరే వారసత్వం భూములు కనుక సంబంధిత లింకుడ్ డాక్యుమెంట్స్ (పూర్వ రిజిస్ట్రేషన్ పత్రాలు) ప్రజలకు ఉండవు. బ్యాంకు వారు ఆ భూమిలో కొన్ని సంవత్సరాలుగా ఉంటున్నట్టు రుజువు చూపించాలని కోరుతారు. ప్రభుత్వం ఆ రుజువునే పొజిషన్ సర్టిఫికేట్ గా నిర్ధారించారు. ఈ సమస్యను అవకాశం గా తీసుకున్న గ్రామ రెవెన్యూ అధికారులు పేద ప్రజల నుంచి వసూళ్లకు అలవాటు పడ్డారు. ప్రజల పనిబట్టి ఒక రేట్ ఫిక్స్ చేసుకున్న గ్రామ రెవెన్యూ అధికారులు ప్రజలు చేసేదేమీ లేక లబోదిబో అనుకుంటూ సమస్యను ఎవరికి చెప్పుకోవాలి అర్థం కాక విలవిలలాడుతున్నారు. ప్రజల మొర మండల తాసిల్దార్ వారికి తెలుపుదాం అనుకున్న ఎమ్మార్వో కే తప్పుడు ప్రచారం చేసి తాసిల్దార్ని గ్రామ రెవెన్యూ అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారు. చీరాల తహసిల్దార్ వారు ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని న్యాయానికి ప్రతిరూపం అని ప్రజలు కొని ఆడుతున్నారు. ఈ సమస్యను ఎమ్మార్వో వెంటనే తప్పుదావూ పట్టిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని ప్రజలను ఆదుకోవాలని కోరుకుంటున్నారు. పూర్వికుల భూములను ఎంతో ఖర్చు చేసి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న కుటుంబ వారసులు. భూమి ఉన్న ఆర్థిక స్తోమత వల్ల గృహాన్ని నిర్మూలించు కోలేకపోతున్నారని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా గ్రామ రెవెన్యూ అధికారులు పేద ప్రజల కష్టాలు తెలుసుకొని వారికి తోడుగా ఉండాలని కోరుకుంటున్నారు. అయ్యా రామయ్య వినవ్వయ పేద ప్రజల మొర్ర ఆలకించ రావయ్యా పేద ప్రజల కష్టాలు తిర్చవయ్యా.

రోజుకి 500 సంపాదించుకునే పేద ప్రజల వద్ద 30,000 డిమాండ్ చేయటం పాపమయ ఇప్పటికీ కనుకరించకపోతే ఇల్లు లేక రోడ్ల పైన ఉండాల్సిన పరిస్థితి అయ్యా ఓ గ్రామ రెవెన్యూ అధికారి జాలి చూపవయ్యా ఆ పేద ప్రజల పైన.

ఉత్కంఠ భరితంగా సాగిన పోలీస్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్

- చీరాల సబ్ డివిజన్ జట్టుపై విజయం సాధించిన హెడ్ క్వార్టర్ టీమ్
- అద్భుత బ్యాటింగ్ తో జట్టును విజయతీరాలకు చేర్చిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్
- గెలుపు ఓటములు అనేవి ముఖ్యం కాదు క్రీడా స్ఫూర్తే ప్రాధాన్యం
- పోలీస్ అధికారులు, సిబ్బంది పని ఒత్తిడిని అధిగమించేందుకే క్రికెట్ పోటీలు

బాపట్ల మే17 (మనసులోమాట).. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పని ఒత్తిడిని అధిగమించి మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ మైదానములో జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందితో క్రికెట్ టోర్నమెంట్ ఇటీవల ప్రారంభించడం జరిగింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లొ చీరాల సబ్ డివిజన్ జట్టుపై హెడ్ క్వార్టర్ జట్టు అద్భుత విజయం సాధించింది. ఎంతో ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్ లొ జిల్లా ఎస్పీ అద్భుతమైన బ్యాటింగ్ తో హెడ్ క్వార్టర్ టీం 20 ఓవర్లలో 180 పరుగులు చేసింది. జిల్లా ఎస్పీ క్రీడాకారులకు కప్ ను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పై పని ఒత్తిడి అధికంగా ఉంటుందన్నారు. పని ఒత్తిడి నుండి బయటపడి మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని బాపట్ల జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పని ఒత్తిడి నుండి ఉపశమనం పొంది మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించేందుకు జిల్లా పోలీస్ క్రీడా మైదానంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ టోర్నమెంట్‌లో చీరాల, బాపట్ల, రేపల్లె సబ్ డివిజన్లకు చెందిన మూడు జట్లు, ఏఆర్ జట్టు అదేవిధంగా హెడ్ క్వార్టర్ జట్టు మొత్తం 5 జట్లు పాల్గొన్నాయన్నారు. ఈరోజు చీరాల సబ్ డివిజన్ జట్టు, హెడ్ క్వార్టర్ జట్టులకు మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ లో హెడ్ క్వార్టర్ జట్టు విజయం సాధించిందన్నారు. పూర్తిగా స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో గెలుపు, ఓటములను సమానమన్నారు. క్రీడల వలన నాయకత్వ లక్షణాలు పెరగడంతో పాటు సమిష్టి కృషి అలవడుతుందన్నారు. క్రీడలు ఆడడం, వీక్షించడం మంచి అలవాట్లు అయినప్పటికీ క్రీడలపై బెట్టింగ్‌లు నిర్వహించడం ప్రమాదకరమని హెచ్చరించారు. బెట్టింగ్‌ల వలన అనేక మంది ఆర్థికంగా నష్టపోవడం తో పాటు తమ జీవితాలను అంధకారంలోకి నెట్టుకున్న ఉదాహరణలు ఉన్నాయన్నారు. ఇలాంటి పరిణామాలు చూస్తూనే కొంతమంది అత్యాశతో, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారన్నారు. యువత బెట్టింగ్ అనే మహమ్మారికి దూరంగా ఉండాలని, క్రికెట్‌ను కేవలం క్రీడా స్ఫూర్తితో మాత్రమే చూడాలన్నారు. దానిని జూదంగా మార్చి తమ అమూల్యమైన భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు సిసియస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, ఎస్‌బీ సీఐ జి. నారాయణ, ఎస్‌బీ2 ఇన్స్పెక్టర్ ఎం.రాంబాబు, సీసీఎస్ ఇన్స్పెక్టర్ పి. ప్రేమయ్య, ఆర్.ఐలు మౌలుద్దీన్, ప్రదీప్, చీరాల 2 టౌన్ సీఐ శశి కుమార్, ఇతర పోలీస్ అధికారులు, చీరాల సబ్ డివిజన్, జిల్లా హెడ్ క్వార్టర్స్ జట్ల సభ్యులు పాల్గొన్నారు.

దేవాలయం, షాపులు నిర్మాణం ఇప్పట్లో జరిగేనా?

– భక్తులు వ్యాపారస్తుల మనోవేదన

చీరాల మే 17 (మనసులో మాట).. పట్టణంలో పునర్నిర్మాణం పేరుతో తొలగించిన వీరరాఘవ స్వామి దేవాలయం, షాపుల నిర్మాణం ఇప్పట్లో జరిగే నా అని భక్తులు, వ్యాపారస్తులు మనో వేదనను వ్యక్తం చేస్తున్నారు. చీరాల పట్టణానికి నడిబొడ్డున ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన వేదవల్లి కనకవల్లి సమేత వీర రాఘవ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో పునర్నిర్మాణం పేరుతో తొలగించిన సంగతి అందరికీ తెలిసిందే. నిత్యం వందల కొలది భక్తులు దేవాలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. అంతేగాక ప్రతి సంవత్సరం వారం రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ పట్టణ ప్రజలను, భక్తులను ఎంతగానో ఆకట్టుకున్న ఆలయాన్ని అర్ధాంతరంగా తొలగించడంతో భక్తులు అసంతృప్తితో ఉన్నారు. ఎన్నో సంవత్సరాలుగా స్వామి అనుగ్రహం పొందిన భక్తులు ప్రత్యేక పూజలు చేసుకోవడానికి వీలు లేక తమలో తాము బాధ పడిపోతున్నారు. గుడి నిర్మాణం భక్తుల విరాళాలతోపాటు దేవాదాయ శాఖ మంజూరు చేసే నిధులతో పునర్నిర్మాణం చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో దేవాదాయ శాఖ అధికారులు పునర్నిర్మాణం కొరకు టెండర్ల కూడా పిలిచినప్పటికీ నేటికిని నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై భక్తులు అసహనం వ్యక్తపరుస్తున్నారు. పట్టణం నడిబొడ్డున పాదచారులను, ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకునే దేవాలయం తొలగించడం పట్ల ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దేవాలయానికి విచ్చేసే భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా ఆలయ పునర్నిర్మాణం జరగాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు. ఇదిలా ఉండగా దేవాలయాన్ని ఆనుకొని దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్నటువంటి షాపులను కూడా తొలగించడంతో వ్యాపారస్తులు ఆదాయాన్ని కోల్పోయి అసహనంతో ఉన్నారు. ఎన్నో సంవత్సరాలుగా షాపులను నమ్ముకుని వ్యాపారం చేసుకుంటున్న వ్యాపారస్తులు తమకు త్వరగా షాపుల నిర్మాణం చేసి ఇవ్వాలని కోరుకుంటున్నారు. షాపుల తొలగింపుతో వ్యాపారాలు మూసివేసిన కారణంగా కుటుంబాలు గడవడం భారంగా మారిందని వ్యాపారస్తులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో దేవాదాయ శాఖ అధికారులు వీర రాఘవ స్వామి ఆలయం భక్తుల మనోభావాలను, షాపుల యజమానుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్వరిత గతిన ఆలయ నిర్మాణం తోపాటు, షాపుల నిర్మాణాన్ని కూడా చేపట్టాలని ఆకాంక్షను వ్యక్తపరుస్తున్నారు.

ప్రత్తిపాటి సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తి

- డాక్టర్ పేర్ని కృష్ణమోహన్ - ప్రత్తిపాటి శరత్ ఆధ్వర్యంలో భారీ ఉచిత కంటి వైద్య శిబిరం

చిలకలూరిపేటమే 17 మనసులో మాట మాజీమంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుకు డాక్టర్ పేర్ని కృష్ణమోహన్ (అమ్మ దంత వైద్యశాల) ముందస్తుపుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవను ప్రధాన ధ్యేయంగా తీసుకొని ప్రత్తిపాటి పుల్లారావు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ, ప్రత్తిపాటి పుల్లారావు పుట్టినరోజు ను పురస్కరించుకొని ఈనెల 29వ తేదీ శుక్రవారం నిర్వహించనున్న 43వ ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ ఆధ్వర్యంలో ప్రముఖ శంకర్ కంటి వైద్యశాల సహకారంతో ఈ భారీ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గతంలో ప్రధానంగా కంటి శుక్లాల సమస్యలకు మాత్రమే పరిమితమైన వైద్య సేవలను ఈసారి మరింత విస్తృత స్థాయిలో అందిస్తున్నామని పేర్కొన్నారు. రెటీనా సంబంధిత వ్యాధులు, రెటీనా డిటాచ్మెంట్‌తో పాటు కంటికి సంబంధించిన పలు క్లిష్ట సమస్యలకు నిపుణులైన వైద్యులచే పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. సాధారణంగా లక్ష రూపాయలకు పైగా ఖర్చయ్యే అత్యాధునిక చికిత్సలను నిరుపేదలకు ఉచితంగా అందించడం ఈ శిబిరం ప్రత్యేకతగా నిలుస్తుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకొని కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ప్రజలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇలాంటి సేవలు అందించడం గొప్ప విషయమని పేర్కొంటూ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన తనయుడు శరత్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును ఆదర్శంగా తీసుకొని చుట్టుపక్కల జిల్లాల్లో కూడా అనేక మంది ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని డాక్టర్ పేర్ని కృష్ణమోహన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ప్రత్తిపాటి పుల్లారావుకు మరోసారి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉచిత సినీనట శిక్షణ ఓ పెద్ద బాలశిక్ష - ఏపీ ఎఫ్డిసి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ నాయక్

తెనాలి మే17(మనసులో మాట). ఉన్నత ప్రమాణాలు గలనట శిక్షణ ఔత్సాహికులకు ఓ పెద్ద బాలశిక్ష లాంటిదని ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ శ్రీనివాస నాయక్ అన్నారు.ఆదివారం స్థానిక అంబేద్కర్ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఉచిత నటశిక్షణ వర్క్ షాప్ ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి కార్యక్రమ నిర్వాహకుడు మా ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్ రాజా అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని నలుమూలల నుండి శిక్షణలో పాల్గొన్న 60 మంది అభ్యర్థులకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. ఆదివారంతో ముగిసిన ఉచిత సినీనట శిక్షణ వర్క్ షాప్ కు హాజరైన ఔత్సాహికులకు సినిమా నటన పట్ల కనీస అవగాహన నేర్చుకున్నామని తెలియజేయడం అభినందనీయమని శ్రీనివాస నాయక్ అన్నారు.ఎంతో పారదర్శకతతో ఆంధ్రాలో సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న మా ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్ రాజా చేస్తున్న నిరంతర ప్రయత్నాలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయన్నారు.సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం జరిపే చర్చలకు దిలీప్ రాజాను ఆహ్వానిస్తామని ఆయన తెలిపారు. మా ఏపీ వ్యవస్థాపకుడు సినీ దర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ సినిమా నిర్మాణంలో నటుడు నుండి దర్శకుడు వరకు చేయవలసిన బాధ్యత రాహిత్య కార్యక్రమాలను అభ్యర్థులకు బోధించామని,శిక్షణలో నుండి ఇరువురు దర్శకులుగా మారటం మా ఏపీకి గర్వకారణమన్నారు. అడ్మిషన్ల పేరుతో కార్డుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న సంఘాల పట్ల ఔత్సాహికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిఓపి మైనేని హరిప్రసాద్, మహిళా దర్శకురాలు నాగశ్రీ, డైరెక్టర్ శకనాల చంద్రశేఖర్, స్టైల్ రవి, పాత్రుడు,వర్మ, జాల రాజకుమారి,బాషా తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ట్రైని ఐపీఎస్ నిరంజన్ మహేందర్ సిన్హా

నాదెండ్ల మే 17 : మనసులోమాట.. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నాదెండ్ల పోలీస్ స్టేషన్ ట్రైన్ ఐపీఎస్ అధికారి జాదారపు నిరంజన్ మహేందర్ సిన్హా అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్లలో సైబర్ నేరాలు గంజాయి డ్రగ్స్ వంటి వాటిపై గ్రామస్తులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నిరంజన్ మహేందర్ సిన్హా మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మీ ఫోన్ కి ఫోన్ చేసి ఓటిపిలు, యూపీఐ నెంబర్లు, సమాచారం చెప్పాలని అడుగుతారన్నారు. ఎవరు ఫోన్ చేసినా అడిగిన ఓటీపీలు, పిన్ నెంబర్ 2 పిన్ నెంబర్స్ చెప్పరాదు అన్నారు. ఆన్లైన్లో వచ్చిన మోసపూరిత ప్రకటనలు నమ్మి మోసపోవద్దు అన్నారు. అనుమానాస్పదంగా వచ్చే లింకులను క్లిక్ చేయరాదు అన్నారు. డిజిటల్ అరెస్టులను ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తారన్నారు. డిజిటల్ అరెస్టులు అనేవి బూటకం అన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 కి టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. రూరల్ సీఐ బత్తిన సుబ్బనాయుడు మాట్లాడుతూ యువత గంజాయి కి, డ్రగ్స్ కి దూరంగా ఉండాలి అన్నారు. చిన్న వయసులోనే కొంతమంది యువత డ్రగ్స్ కి గంజాయికి అలవాటు పడి జీవితాలు అంధకారం చేసుకుంటున్నారు అన్నారు. గంజాయి డ్రగ్స్ కి అలవాటు పడిన యువత నేరాల బాట పడుతున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చెడు మార్గాల వైపు మరలకుండా మంచి మార్గాల వైపు ఉండేలా కృషి చేయాలన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారు అనేది తల్లిదండ్రులు నిత్యం గమనించాలి అన్నారు. ఎంతోమంది విద్యార్థులు చదువుకోవాల్సిన సమయంలో కాలేజీలు పాఠశాలలకు దుమ్మి కొట్టి, డ్రగ్స్ కి మొత్తు పదార్థాలకు బానిసలుగా మారి చదువులకు స్వస్థపలికి చెడుబాట పడుతున్నారు అన్నారు. ఈ సదస్సులో ఎస్సై ఆర్ వెంకటేశ్వరరావు, ఏ ఎస్ ఐ లు సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

సీనియర్ ఫోటో గ్రాఫర్ అనారోగ్యంతో మృతి

నాదెండ్ల మే 17 : మనసులోమాట.. ధూళిపాల లక్ష్మీ కాంతారావు మృతికి సంతాపం వ్యక్తం చేసిన పలువురు ప్రముఖులు.... ఫోటో గ్రాఫ్ఫార్స్‌లి మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ ధూళిపాల లక్ష్మీ కాంతారావు అనారోగ్యంతో ఆదివారం రాత్రి కన్నుమూశారు.చిలకలూరిపేట లో గత 40 సంవత్సరాల నుంచి ఫోటోగ్రఫీ వృత్తి చేస్తూ సీనియర్ ఫోటోగ్రాఫర్ గా మంచి పేరు తెచ్చుకున్న ధూళిపాల లక్ష్మీ కాంతారావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. గణపవరంలోని శాంతినగర్ లో ఉన్న ఆయన నివాసంలో కన్నుమూశారు .చిలకలూరిపేటలో శ్రీనివాస ఫోటో స్టూడియో ను పెట్టి ఎంతోమందికి ఫోటోగ్రఫీ నేర్పించి అందరికీ గురువుగా పేరు తెచ్చుకున్న ధూళిపాల లక్ష్మీకాంతారావు అనారోగ్యంతో మృతి చెందడం ఫోటోగ్రఫీ అసోసియేషన్కు తీరని లోటు అని పలువురు ఫోటోగ్రాఫర్లు విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గణపవరం లోని ఆయన నివాసంలో ఉన్న పార్థివదేహానికి పలువురు ప్రముఖులు ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు నివాళులు అర్పించారు. లక్ష్మీ కాంతారావు కి భార్యతో పాటు ఒక కుమారుడు కుమార్తె కలరు.

దేశ భవిష్యత్తుకు విద్యే పునాది

నాదెండ్ల మే 17 : మనసులోమాట,విద్య అనేది ఒక దేశ భవిష్యత్తుకు బలమైన పునాది. అయితే భారతీయ విద్యా వ్యవస్థ ఇప్పటికీ బ్రిటిష్ పాలనలో రూపొందించబడిన, భాష తత్వాలను ఆధారంగా చేర్చుకొని ముందుకు సాగుతుందని, చిరుమామిళ్ల విద్యా గ్రామాభివృద్ధి ప్రదాత గోల్కొండ గ్రూప్ సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి అన్నారు. మండలంలోని చిరుమామిళ్ల రామిరెడ్డి అతిథి గృహంలో శనివారం రామిరెడ్డి మాట్లాడుతూ. విద్యార్థి మేధస్సు అభివృద్ధి, జీవిత నైపుణ్యాలకు బదులుగా మార్కులకు ప్రాధాన్యత నిచ్చే ఈ విధానం ఇప్పటికీ కొనసాగుతుందన్నారు. అందువల్ల మన దేశంలో ఉన్న విద్య వ్యవస్థ గతంలో తయారైన భారత విధానాలను అనుసరిస్తూ నేటి కాలానికి సరిపోని విధంగా కొనసాగుతుందన్నారు. కేవలం పుస్తకాలపై ఆధారపడే మార్కుల పైన దృష్టి పెట్టే విధానం విద్యార్థులు నిజమైన ప్రతిభను బయట పెట్టడంలో విఫలం అవుతుంది అన్నారు. విద్యా అనేది వ్యక్తి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం అన్నారు కానీ మనదేశంలో అమలవుతున్న ప్రస్తుత విద్యావ్యవ స్థ కొన్ని లోపాలతో పాటు ఆధునిక ప్రపంచ అవసరాలకు సరిపడని విధంగా ఉందన్నారు. మార్కులకే ప్రాధాన్యం కృత్రిమ పోటీ సృజనాత్మకతకు ప్రాధాన్యం లేకపోవడం, వంటి అంశాలు ఈవ్యవస్థలో కనిపిస్తున్న ప్రధాన సమస్యలు. పాఠశాలలో విద్యార్థులకు సమాచారాన్ని అర్థం చేసుకోవడం కన్నా, పాఠ్యాంశాన్ని జ్ఞాపకాల్లోకి తెచ్చుకుని పరీక్షలు వ్రాయడమే లక్ష్యంగా ఉంటుందన్నారు. ఇది వారిలో నిర్దిష్టమైన ఆలోచనలకు సమస్య పరిష్కార నైపుణ్యాలను తగ్గిస్తుందన్నారు. నేటి విద్యార్థులు ప్రగతి సాధించడంలో దిట్టలు కానీ విద్యార్థులు జీవితాన్ని ఎదుర్కోవడంలో అసాధ్యాలువంటి వాటిని పదవ తరగతి నుంచి పూర్తి చేయించాలి అన్నారు. వారి ఆర్థిక నిర్వహక, భావోద్వేగాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి మౌలిక జీవిత నైపుణ్యాలను, నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత విద్యార్థులు చదువుతున్న కోర్సులు ఉద్యోగ అవకాశాలు అనుకూలంగా ఉండటం లేదన్నారు. వాస్తవ ప్రపంచ అవసరాలకు అనుగుణంగా సిలబస్ రూపకల్పన చేయాలన్నారు.

విద్యార్థులకు ఉచిత బట్టల పంపిణీ

చిలకలూరిపేటమే 17 మనసులో మాట.. స్థానిక మదర్సా జీనతుల్ ఖురాన్ మరియు జీనత్ ఇంగ్లీష్ అండ్ ఉర్దూ మీడియం స్కూల్ నందు విద్యార్థులకు ఉచిత బట్టల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల తహసిల్దార్ షేక్ హుస్సేన్ , పట్టణ సిఐ రమేష్ మరియు మున్సిపల్ డిఈ షేక్ రహీం విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగావారుమాట్లాడుతూరూపాయి ఖర్చు లేకుండా 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పేద విద్యార్థులకు ఎంతో క్రమశిక్షణతో కూడిన ఉచిత విద్యను అందించడమే కాకుండా, ఉచితంగా బట్టలను కూడా పంపిణీ చేయడం గొప్ప విషయమని కొనియాడారు. సమాజంలో పేద విద్యార్థులకు నాణ్యమైన చదువును అందిస్తూ అండగా నిలుస్తున్న జీనత్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పఠాన్ ఖాలీద్ ఖాన్ సేవా నిరతిని, వారి లయబిలిటీని అధికారులు ముక్తకంఠంతో ప్రశంసించారు. కార్యక్రమంలో లక్కీ రోడ్ లైన్స్, పెట్రో ప్లాజా అధినేత ఎండీ యూసుఫ్ అలీ , మదర్సా సెక్రెటరీ షేక్ అబ్దుల్ రహమాన్ (కాటన్) పాల్గొని ప్రసంగించారు. వీరితో పాటు ముక్తి అనస్ ఖాన్ , షేక్ బిలాల్ , షేక్ బాజీ (ఆర్మీ), షేక్ భారీ మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడేళ్ల సంక్షోభం తరువాత రాష్ట్రంలోని

నూలు మిల్లులు లాభాల బాట

చిలకలూరిపేట మే 17 మనసులో మాట

పత్తి (పత్తి దూది) లేదా ఇతర సహజ కృత్రిమ పీచులను యంత్రాల సహాయంతో దారంగా (నూలు) మార్చే పరిశ్రమను నూలు మిల్లు అంటారు. గుంటూరు, ప్రకాశం పరిసర ప్రాంతాలలో వీటిని సాధారణంగా స్పిన్నింగ్ మిల్లులు అని పిలుస్తారు.

ప్రధాన ప్రక్రియలు:

దూదిని శుభ్రం చేయడం: పత్తిలోని వ్యర్థాలను తొలగించి, పీచును వేరుచేయడం.కార్డింగ్ మరియు డ్రాయింగ్: పీచును ఒకే వరుసలో పేర్చి, పోగులుగా మార్చడం. వడకడం (స్పిన్నింగ్): పోగులను మెలితిప్పి గట్టి దారంగా మార్చడం. మూడేళ్ల సంక్షోభం తర్వాత రాష్ట్రంలో నూలు మిల్లులు లాభాల బాటలో పయనిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో జౌళి ఉత్పత్తులకు పెరిగిన భారీ డిమాండ్, చైనా, బాంగ్లాదేశ్‌లకు తిరిగి భారీగా ప్రారంభమైన ఎగుమతులు ఈ రంగానికి మళ్లీ ప్రాణం పోశాయి. నష్టాల ఊబిలో కూరుకుపోయిన మిల్లులు ఇప్పుడు గిట్టుబాటు ధరలతో లాభాల బాట పట్టాయి.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే నూలు మిల్లుల రంగం గత ముడేళ్లుగా తీవ్రమైన సంక్షోభంలో కూరుకు పోయింది. 2022 నుంచి 2025 వరకు పెరిగిన విద్యుత్ ఛార్జీలు, ఖరీదైన ముడిసరకు ధరలు, పడిపోయిన ఎగుమతుల కారణంగా రాష్ట్రంలోని దాదాపు 30కి పైగా మిల్లులు పూర్తిగా మూతపడ్డాయి. వేలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. కానీ, మూడేళ్ల సుదీర్ఘ చీకటి కాలం తర్వాత, అంతర్జాతీయ మార్కెట్‌లో జౌళి ఉత్పత్తులకు పెరిగిన భారీ డిమాండ్ కారణంగా 2026 ఏప్రిల్ నాటికి ఈ పరిశ్రమలో అనూహ్యమైన మార్పు చోటుచేసుకుంది. ఎగు మతులు పెరిగి మిల్లులు ఇప్పుడు గిట్టుబాటు ధరలతో లాభాల బాట పట్టాయి. కష్టాల కొలిమి నుంచి లాభాల తీరం వైపు సాగుతున్న ఏపీ నూలు మిల్లుల పునరుజ్జీవన ప్రయాణం మూడేళ్లుగా ఇలా సాగింది.

ఆర్థిక వ్యవస్థ కీలకపాత్ర

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో దశాబ్దాలుగా అత్యంత కీలక పాత్ర పోషిస్తూ, లక్షలాది మందికి జీవనాధారంగా నిలిచిన వస్త్ర, నూలు పరిశ్రమ, గత కొన్నేళ్లుగా ఊహించని రీతిలో అత్యంత తీవ్రమైన ఒడుదొడుకులను, భయానకమైన ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొని, ఎట్టకేలకు ఒక సానుకూలమైన మలుపు తిరిగింది. 2022 ఏప్రిల్‌లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన సరఫరా గొలుసు అంతరాయాలతో ప్రారంభమైన ఈ చీకటి దశ, క్రమంగా 2025 నాటికి రాష్ట్ర పారిశ్రామిక రంగానికి ఒక పీడకలగా పరిణ మించింది.

సుమారు 35 లక్షల స్పిండిల్ సామర్థ్యం కలిగి, ప్రత్యక్షంగా 70 వేల మంది కార్మికులకు, పరోక్షంగా మరో లక్ష మందికి పైగా ఉపాధి కల్పిస్తున్న ఈ అతిపెద్ద రంగం కుప్పకూలే పరిస్థితికి చేరుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 125 నూలు మిల్లులలో, మూడేళ్ల పాటు వరుసగా వచ్చిన భారీ నష్టాలను ఆర్థికంగా తట్టుకోలేక సుమారు 30 మిల్లులు శాశ్వతంగా మూతపడగా, మిగిలినవి మనుగడ కోసం కష్టాల కొలిమిలో అత్యంత దీన స్థితిలో నెట్టుకు రావాల్సి వచ్చింది. ఈ మూసివేతల కారణంగా అప్పటివరకు పరిశ్రమలపై ఆధారపడి బతుకుతున్న వేలాది మంది కార్మికులు రాత్రికి రాత్రే తమ జీవనోపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారు.

వాస్తవానికి, ఒక నూలు మిల్లును ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆపివేస్తే, అందులో పనిచేసే 300 నుండి 800 మంది అత్యంత నిపుణులైన కార్మికులు ఉపాధి వెతుక్కుంటూ తమ స్వగ్రామాలకు వలస వెళ్లిపోతారు. దీనివల్ల వాతావరణం అనుకూలించి భవిష్యత్తులో ఆ మిల్లును తిరిగి ప్రారంభించాలను కున్నా, నైపుణ్యం ఉన్న కార్మికుల కొరత వల్ల అది దాదాపు అసాధ్యంగా మారుతుంది. అంతర్జాతీయ వాణిజ్యంలో వచ్చిన అనూహ్యమైన ప్రతికూల మార్పులు, ముడిసరకు లభ్యత తగ్గిపోవడం, దేశీయంగా తలెత్తిన ఆర్థిక ఇబ్బందుల వలయంలో చిక్కుకుని, బ్యాంకుల నుంచి తీసుకున్న భారీ రుణాల వాయిదాలు కూడా చెల్లించలేని స్థితిలో పలు ప్రతిష్టాత్మక మిల్లులు నిరర్థక ఆస్తులుగా మిగిలిపోయాయి.

మార్కెట్ ధరలు ఉత్పత్తి ఖర్చుల మధ్య భారీ వ్యత్యాసం

ఈ చారిత్రక సంక్షోభానికి ప్రధాన కారణం మార్కెట్ ధరలకు, ఉత్పత్తి ఖర్చులకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసమే అని చెప్పవచ్చు. 2025 నాటి గడ్డు పరిస్థితులను నిశితంగా గమనిస్తే, మార్కెట్లో గిట్టుబాటు ధరలు పూర్తిగా పతనమవడం, మరోవైపు ఉత్పత్తి వ్యయం విపరీతంగా పెరగడంతో కిలో దారం ఉత్పత్తిపై మిల్లు యజమానులకు సగటున రూ. 10 నుంచి రూ. 15 వరకు కచ్చితమైన నష్టం వాటిల్లింది. అధిక పరిమాణంలో ఉత్పత్తి జరిగే ఈ రంగంలో ఇంత భారీ నష్టం రావడం పరిశ్రమ పునాదులనే కదిలించింది. ఇందులో విద్యుత్ ఛార్జీల భారం మిల్లుల పాలిట ఉరితాడులా మారింది. కిలో దారం ఉత్పత్తికి అయ్యే మొత్తం వ్యయంలో ఏకంగా 55 శాతం కేవలం విద్యుత్ బిల్లులకే సరిపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఉదాహరణకు, ఒక కిలో 40-కౌంట్ దారం ఉత్పత్తి చేయడానికి రూ. 80 నుంచి రూ. 87 వరకు ఖర్చు అవుతుంటే, అందులో సగానికి పైగా, అంటే రూ. 42 నుంచి రూ. 43 కేవలం కరెంటుకే వెచ్చించాల్సి రావడం ఈ రంగం ఆర్థిక దుస్థితికి అద్దం పడుతోంది. దీనికి తోడు ప్రభుత్వాల నుంచి పారిశ్రామిక రాయితీల కింద రావాల్సిన రూ. 1,000 కోట్ల ప్రోత్సాహకాల బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడం, సొంత విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు లేని చిన్న మిల్లులకు ప్రాణసంకటంగా మారింది. మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు పరిశ్రమలకు మద్దతుగా విద్యుత్ ఛార్జీలు తక్కువగా నిర్ణయించ డంతో, ఏపీ మిల్లులు జాతీయ మార్కెట్ పోటీలో దారుణంగా వెనుకబడిపోయాయి. ఇక అత్యంత కీలకమైన ముడిసరకు విషయానికి వస్తే, అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక క్యాండీ దూది (356 కిలోలు) రూ. 50 వేలు తక్కువ ధరకు లభిస్తున్నప్పటికీ, ప్రభుత్వం విధించిన 11 శాతం అదనపు దిగుమతి సుంకం వల్ల ఆ ప్రయోజనం మిల్లులకు దక్కలేదు. దీంతో, స్థానిక మిల్లులు అనివార్యంగా దేశీయ మార్కెట్లోనే రూ. 56,000 అత్యధిక ధర వెచ్చించి పత్తిని కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇలా అడుగడుగునా ఖర్చులు పెరిగి పోవడంతో మిల్లులు నష్టాల ఊబిలో కూరుకు పోయాయి.

పెరిగిన డిమాండ్

అయితే, సుదీర్ఘమైన కారుచీకటి తర్వాత అనూహ్యంగా వెలుగు రేఖలు వచ్చినట్లుగా, 2026 ఏప్రిల్ నాటికి రాష్ట్ర నూలు మిల్లుల పరిస్థితిలో అనూ హ్యమైన, అత్యంత ఆశాజనకమైన మలుపు చోటుచేసుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో జౌళి ఉత్పత్తులకు అకస్మాత్తుగా తీవ్రమైన కొరత ఏర్పడటంతో, ప్రపంచ వ్యాప్తంగా నూలు డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఇది ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ నూలు మిల్లులకు నిజమైన సంజీవినిలా పనిచేసింది. దాదాపు రెండేళ్లుగా పూర్తిగా నిలిచిపోయిన విదేశీ ఎగుమతులు తిరిగి పూర్తి స్థాయిలో ఊపందుకోవడం ఈ ఆకస్మిక పునరుజ్జీవ నానికి ప్రధాన కారణం. ప్రస్తుతం మన దేశంలో ఉత్పత్తయ్యే మొత్తం దారంలో దాదాపు 20 శాతం చైనా దేశానికి, 5 శాతం బాంగ్లాదేశ్‌కు నేరుగా ఎగుమతి అవుతూ పరిశ్రమకు ఊపిరి పోస్తోందిట. ముఖ్యంగా రాష్ట్రంలో తయారయ్యే 21-కౌంట్ దారానికి చైనా మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ప్రపంచవ్యాప్తంగా అమ్ముడయ్యే నాణ్యమైన టవళ్లు, కర్టెన్లు, ఇతర గృహాలంకరణ జౌళి ఉత్పత్తుల తయారీలో అత్యంత కీలకమైన ఈ 21-కౌంట్ దారాన్ని మన మిల్లులు ప్రస్తుతం కిలోకు రూ. 240 లాభదాయకమైన ధరకు భారీ ఎత్తున విక్రయిస్తున్నాయి. మరోవైపు, ప్రపంచంలోనే అతిపెద్ద వస్త్ర తయారీ కేంద్రంగా ఉన్న బాంగ్లాదేశ్, తమ దేశంలోని భారీ గార్మెంట్ పరిశ్రమ, ముఖ్యంగా టీ-షర్టులు, బనియన్లు, లోదుస్తుల తయారీ కోసం మన రాష్ట్రం నుంచి 30, 34, 40-కౌంట్ దారంతో పాటు అత్యుత్తమ నాణ్యత గల ముడి పత్తిని కూడా పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తోంది. వస్త్ర పరిశ్రమలో అత్యంత కీలకమైన నాణ్యమైన 40-కౌంట్ దారానికి అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం కిలోకు రూ.305 రికార్డు స్థాయి ధర పలుకు తుండటం విశేషం. దీనికి అదనపు బోనస్‌గా, భారత రూపాయి మారకపు విలువతో పోలిస్తే అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్ అనూహ్యంగా బలపడటం కూడా మన ఎగుమతిదారుల లాభాల శాతాన్ని గణనీయంగా పెంచి, వారు ఆర్థికంగా వేగంగా గట్టెక్కడానికి ఎంతగానో సహాయపడింది.

కొత్త సవాలు

ఈ విధంగా మిల్లులు తమ మూడేళ్ల సుదీర్ఘమైన, బాధాకరమైన సంక్షోభం నుంచి విజయవంతంగా కోలుకుంటున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో వారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరో కొత్త సవాలును ధైర్యంగా ఎదుర్కోవాల్సి వస్తోంది. ఏ విదేశీ ఎగుమతుల డిమాండ్ అయితే వారిని నష్టాల ఊబి నుంచి గట్టెక్కించిందో, కచ్చితంగా అదే డిమాండ్ ఇప్పుడు ప్రధాన ముడిసరకు ధరల అమాంతం పెరుగుదలకు కూడా పరోక్షంగా దారితీస్తోంది. వాతావరణ మార్పుల వల్ల ప్రపంచవ్యాప్తంగా పత్తి దిగుబడి గణనీయంగా తగ్గడం, అంతర్జాతీయంగా జౌళి ఉత్పత్తులకు డిమాండ్ అత్యంత తీవ్రంగా ఉండటం వల్ల, దారం తయారీకి మూలాధారమైన ముడిపత్తి ధరలు మళ్లీ ఆకాశాన్నంటుతు న్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉందంటే, 2026 జనవరి నెలలో రూ. 55,000 గా ఉన్న ఒక క్యాండీ దూది (356 కిలోలు) మార్కెట్ ధర, కేవలం మూడు నెలల స్వల్ప వ్యవధిలోనే, అంటే ఏప్రిల్ నాటికి ఏకంగా రూ. 61 వేలకు పెరిగిపోయి ఉత్పత్తి దారులను కలవరపెడుతోంది. అయినప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్లో నూలుకు ఉన్న బలమైన డిమాండ్,ఎగుమతుల ద్వారా వస్తున్న అత్యంత అనుకూలమైన అధిక ధరలు ప్రస్తుతానికి ఆంధ్రప్రదేశ్‌లోని నూలు మిల్లులను నష్టాల నుంచి కాపాడి తిరిగి లాభాల బాటలోనే పయనించేలా చేస్తున్నాయి. అయితే, దీర్ఘకాలికంగా ఈ సానుకూల పరిస్థితులు స్థిరంగా కొనసాగాలంటే, ఉత్పత్తి వ్యయంలో సింహభాగం ఆక్రమిస్తున్న విద్యుత్ ఖర్చులను శాశ్వతంగా తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందులో భాగంగా, భవిష్యత్తులో పరిశ్రమలన్నీ గ్రీన్ ఎనర్జీ (సౌర, పవన విద్యుత్) యూనిట్లను సొంతంగా ఏర్పాటు చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే సులభ వాయిదాల్లో రుణాలు ఇప్పించే ఒక సమగ్రమైన విధానాన్ని తీసుకువస్తే, 50 శాతంగా ఉన్న విద్యుత్ వ్యయాన్ని శాశ్వతంగా తగ్గించుకోవచ్చు. ప్రపంచవ్యాప్త వస్త్ర డిమాండ్ రాబోయే కాలంలో ఇదే విధంగా స్థిరంగా కొనసాగి, రాష్ట్ర ప్రభుత్వం గతంలో పెండింగ్‌లో పెట్టిన ప్రోత్సాహక బకాయి లను తక్షణమే విడుదల చేసి పారిశ్రామికవేత్తలకు పూర్తి స్థాయిలో నైతిక, ఆర్థిక మద్దతుగా నిలిస్తే, ఆంధ్రప్రదేశ్ వస్త్ర పరిశ్రమ తన కోల్పోయిన పూర్వ వైభవాన్ని తిరిగి పొందడమే కాకుండా రాబోయే దశాబ్దంలో దేశంలోనే అగ్రగామిగా నిలవడం ఖాయం.